


ఎరువుల సమస్యలపై కంట్రోల్‌రూమ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రైతులకు ఎరువుల లభ్యత, సరఫరా, ధరలపై ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులు స్పందించేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఎరువుల సంబంధిత సమస్యలను కంట్రోల్‌రూమ్ నంబరు 9121863788 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కంట్రోల్‌రూమ్ ద్వారా రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సమర్థవంతంగా వ్యవహరించాలని ఆదేశించారు.

తేలిన అన్నదాత సుఖీభవ అర్హులు

- జిల్లాలో 2,80,488 మందికి వర్తింపు
- రేపు రైతుల ఖాతాల్లో నగదు జమ
- తొలి విడతగా ఒక్కొకరికి రూ.7 వేలు చొప్పున సాయం
- నియోజకవర్గాల వారీగా సభల ఏర్పాటు



ఎట్టకేలకు సూపర్ సిక్స్‌లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకం అమలుకు టిడిపి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తామని చెప్పినా, అర్హుల గుర్తింపులో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో అనుకున్న సమయానికి రైతులకు సాయం అందించలేకపోయింది. మే మొదటి వారంలో ప్రారంభించిన ప్రక్రియ జూలై నెలాఖరు నాటికి ఒక కొలిక్కి వచ్చింది. అర్హులైన రైతుల ఖాతాల్లో ఈనెల రెండో తేదీన డబ్బులు జమ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. తొలి విడతగా పిఎం కిసాన్ కింద అందిస్తున్న రూ.రెండు వేలుతో కలిపి ఒక్కొక్క ఖాతాలో రూ.ఏడు వేలు చొప్పున జమ చేయనుంది. అన్నదాత సుఖీభవ సాయం ప్రారంభం నేపథ్యంలో ప్రతి నియోజకవర్గంలో సభలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించింది. దీంతో నియోజకవర్గాల్లో సభల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అన్నదాత సుఖీభవ పథకానికి జిల్లావ్యాప్తంగా 2,80,488 మంది రైతులు అర్హత సాధించారు. అనేక వడపోతల అనంతరం అర్హుల సంఖ్యను ఖరారు చేసింది. అన్నదాత సుఖీభవ అర్హుల గుర్తింపు ప్రక్రియ ఈ ఏడాది మే మొదటి వారంలో ప్రారంభమైంది. వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన వెబ్‌ల్యాండ్ డేటాను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో పాటు మండల వ్యవసాయశాఖ అధికారుల లాగిన్‌లకు పంపారు. వెబ్‌ల్యాండ్‌లో సర్వే నంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం కచ్చితంగా ఉన్నదీ, లేనిదీ రైతు సేవా కేంద్రాల్లో పరిశీలించారు. తర్వాత క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి వారి పరిధి మేరకు అర్హులను గుర్తించారు. రెవెన్యూపరమైన చిక్కులు ఉంటే వాటిని తహశీల్దార్ లాగిన్‌లకు పంపారు. ఆ తర్వాత జిల్లా వ్యవసాయశాఖ అధికారికి పంపారు. జిల్లాస్థాయిలో పరిశీలన పూర్తయిన తర్వాత వెబ్‌ల్యాండ్ వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. అక్కడ్నుంచి ఆర్‌టిజిఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్)కు పంపారు. అక్కడ సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ చేపట్టి ఉద్యోగులు, ప్రభుత్వ ఫించన్ పొందే వారు, ఆదాయపు పన్ను చెల్లించే వారిని గుర్తించిన తర్వాత వారిని తొలగించి తుది జాబితాను జిల్లాలకు పంపారు.

6,173 మందికి ఇకెవైసి పెండింగ్

అన్నదాత సుఖీభవకు అర్హత సాధించిన రైతులకు ప్రభుత్వం ఇకెవైసి తప్పనిసరి చేసింది. ఇకెవైసి లేని వారికి నగదు జమ అయ్యే అవకాశం లేదని అధికారులు చెప్తున్నారు. జిల్లాలో 2,80,488 మంది రైతులు అర్హత సాధించగా, వారిలో ఇప్పటికే 6,175 మందికి రైతుల ఇకెవైసి పూర్తి కాలేదు. వలస వెళ్లిపోవ డంతో రైతులు అందుబాటులో లేకపోవడం, మృతులు వంటి కారణాలతో వారి వేలిముద్రలను సేకరించలేకపోయినట్లు తెలుస్తోంది.

భూ సొంతదారులకే పథకం వర్తింపు

అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రస్తుతం భూ సొంతదారులకే వర్తింపజేస్తోంది. డి-పట్టా, అసైన్డ్ భూముల్లో సాగు చేస్తున్న వారికి సాయం అందించడం లేదు. అదేవిధంగా కౌలు రైతులకూ పథకాన్ని వర్తింపజేయడం లేదు. ప్రస్తుతం కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ సాగుతున్న నేపథ్యంలో రెండో విడతలో వారికి సాయం అందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

భూ సమస్యలపై వినతులను పరిగణనలోకి తీసుకున్నారా?

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా ప్రకటించిన తర్వాత అర్హులైన రైతులకు సైతం జాబితాలో చోటు దక్కలేదు. ఇందుకు గత వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన భూ సమగ్ర సర్వే సందర్భంగా అనేక భూ సమస్యలు తలెత్తిన లోపాలే కారణంగా ఉన్నాయి. జాయింట్ ఎల్‌పిఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్)లు, ఆధార్ అనుసంధానంలో తప్పిదాలు, మ్యుటేషన్ల సమస్య కారణంగా భూముల విస్తీర్ణంలో బాగా తేడాలు వచ్చాయి. ప్రధానంగా జాయింట్ ఎల్‌పిఎం కారణంగా రైతుకు ఐదెకరాల్లోపు భూమి ఉన్నా వెబ్‌సైట్‌లో 30, 40 ఎకరాల భూమి చూపుతోంది. రైతుల్లో ఆందోళన నేపథ్యంలో ఈ ఏడాది జూన్ 21 నుంచి 30వ తేదీ వరకు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెవెన్యూ సిబ్బంది వాటిని సరిచేసిన అనంతరం రైతులు మళ్లీ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే వాటిని పరిగణనలోకి తీసుకుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది. జాబితాలు విడుదలైన తర్వాత దీనిపై ఒక స్పష్టత వస్తుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

'అన్నదాత సుఖీభవ'కు రూ.184 కోట్లు

- రేపు జిల్లావ్యాప్తంగా పంపిణీ
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో 2,74,301 మంది రైతులకు రూ.184 కోట్లు అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రెండో తేదీన జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులకు నేరుగా నగదు మంజూరు చేస్తామని వెల్లడించారు. కలెక్టరేట్ నుంచి అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రాష్ట్రం వాటా కింద రూ.ఐదు వేలు చొప్పున రూ.138 కోట్లు, కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ పథకం ద్వారా రూ.రెండు వేలు చొప్పున రూ.46 కోట్లు మంజూరు కానున్నాయని తెలిపారు. రెండో తేదీన ప్రతి గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించి, అర్హులైన రైతులకు లబ్ధి అందించాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు పథకం ఉద్దేశం, ఆధునిక వ్యవసాయ సాంకేతికత ప్రయోజనాలు, ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పు తదితర అంశాలపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాల కలయికతో ప్రభుత్వం ఒక్కో రైతు కుటుంబానికి ఏటా రూ.20 వేల ఆర్థిక సహాయం అందించనుందని తెలిపారు. ఇందులో కేంద్రం రూ.ఆరు వేలు, రాష్ట్రం రూ.14 వేలు చొప్పున మూడు విడతల్లో ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులు తమ అర్హతను తెలుసుకోవడానికి అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో గానీ మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లో మీ స్థితిని తెలుసుకోండి ఎంపిక ద్వారా తనిఖీ చేయొచ్చన్నారు. ఎఫ్‌సి లింకు, ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధానం వంటి పెండింగ్ అంశాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథస్వామి, ఉద్యాన శాఖ అధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసవ 'వేదన'

బురదలో 108... రోడ్డుపై గిరిజన గర్భిణి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కోటూరింగ్ తాళభద్ర గ్రామానికి చెందిన గిరిజన గర్భిణి గురువారం ప్రసవ'వేదన'కు గురైంది. సవర శ్యామలకు నెలలు నిండడంతో సాయంత్రం నొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. 108 వాహనం గ్రామానికి బయలుదేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా బురద కావడంతో వాహనం కూరుకుపోయింది. అతికష్టం మీద గ్రామానికి చేరుకుని గర్భిణిని తిరిగి తీసుకొచ్చారు. తిరుగు ప్రయాణంలో మళ్లీ వాహనం బురదలో కూరుకుపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో గర్భిణిని రోడ్డు పక్కన కూర్చోబెట్టారు. సిబ్బంది వాహనాన్ని స్వయంగా నెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో వైపు గర్భిణికి పురిటి నొప్పులు అధికమయ్యాయి. ఆమెను వేదనను చూసిన 108 సిబ్బంది బురదలో కూరుకుపోయిన వాహనాన్ని అతికష్టం మీద బయటకు తీసి పలాసలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం శ్యామల పండంటి ఆడ పిల్లకు జన్మనిచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి తారు రోడ్డు మంజూరైనా నోచుకోలేదు. ఇటువంటి తరుణంలో నెలలు నిండిన గిరిజన గర్భిణులకు రోడ్డు రూపంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.


రోడ్డుపై గర్భిణి


వాహనాన్ని నెడుతున్న సిబ్బంది

తీర ప్రాంత భద్రతకు పటిష్ట చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో బారువ, కళింగపట్నం, భావనపాడు తదితర తీర ప్రాంతాల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మత్స్యకారుల భద్రతను దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సముద్రంలో పనిచేసే ప్రతి మత్స్యకారుడు భద్రతతో కూడిన లైఫ్ జాకెట్ విధిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 40 శాతం సబ్సిడీతో లభించే లైఫ్ జాకెట్లను 60 శాతం లబ్ధిదారుడు భరించాల్సి ఉన్నా, అందులో 30 శాతం కలెక్టర్ నిధుల నుంచి సమకూరుస్తామని తెలిపారు. మిగిలిన 30 శాతం కూడా సిఎస్‌ఆర్ నిధుల నుంచి అందించే చర్యలు తీసుకుంటామన్నారు. లైఫ్ జాకెట్ల పంపిణీ అనంతరం ఇవి లేకుండా ఏ ఒక్కరూ సముద్రంలోకి వెళ్లరాదని, వెళ్లిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నభ్మిత్రా యాప్ ద్వారా ఫిషింగ్ బోట్లు ట్రాకింగ్ చేయాలని సూచించారు. కొన్ని తీర ప్రాంతాల్లో నెట్ కనెక్టివిటీ కోసం ఎన్ఐసి జిల్లా సమాచార అధికారితో సమన్వయం చేయాలన్నారు. బోట్లు ఇతర పోర్టుల నుంచి మానవీయ కారణాలతో వచ్చినా, నిర్వాహక అనుమతి లేకుండా పోర్టులోకి ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలన్నారు. బీచ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. విశ్రాంత రోజుల్లో, ఆదివారాల్లో ప్రొఫెషనల్ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ, మత్స్యకార ప్రాంతాల్లో వాలీబాల్, నెట్ తదితర క్రీడా సామగ్రి అందించాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. తీర ప్రాంత మెరైన్ పోలీస్‌స్టేషన్లకు బయో ఫెన్సింగ్ విధానంలో కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. తీర ప్రాంతాల్లో వాచ్ టవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, ఇండియన్ నేవీ స్టాఫ్ ఆఫీసర్ ఆదిత్య పాండే, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, విపత్తుల నిర్వహణ శాఖ డిపిఎం రాము, మత్స్య శాఖ డీడీ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అర్ధనగ్న ప్రదర్శన చేపడుతున్న కార్మికులు

కొత్త ఐఎంఎల్ డిపో ఎందుకు?

- ఎచ్చెర్ల డిపోను విడదీస్తే ఊరుకునేది లేదు
- కార్మికుల ఉపాధిని కాపాడాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు
- హమాలీల అర్ధనగ్న ప్రదర్శన

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి కొత్తగా అధిక మొత్తంలో ప్రజా ధనాన్ని అద్దె రూపంలో చెల్లించి టెక్కలిలో ఎందుకు పెడుతున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎపిబిసిఎల్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీయొద్దని, టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని, మూడు తరాలుగా డిపోలో పనిచేస్తున్న హమాలీల ఉపాధిని కాపాడాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన ఎచ్చెర్ల డిపో ఎదుట కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో యూనియన్ నాయకులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం ఇచ్చినప్పుడు టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేయకుండా కృషి చేస్తానని హామీనిచ్చి ఇప్పుడు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ఇప్పుడు టెక్కలిలో కొత్తగా డిపో పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఎవరు పెట్టాలని కోరారని ప్రశ్నించారు. ఎచ్చెర్లలో వంద మంది దళిత కుటుంబాలకు చెందిన నాలుగు ఎకరాల భూములను 1986లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని ఎచ్చెర్లలో యారక్ బాటలింగ్ యూనిట్ ఏర్పాటు చేసి సారా తయారీ కేంద్రంలో దళిత కుటుంబాలను కార్మికులు, హమాలీలుగా ఉపాధి కల్పించిందని తెలిపారు. అప్పటి ప్రభుత్వ సారా తయారీ నుంచి ఇప్పుడు ఎపి బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐఎంఎల్ డిపోగా నడుస్తున్న దీనిపై 350 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక డిపోగా కొనసాగుతున్న దాన్ని విడగొట్టి, కొత్తగా మరో డిపో ఏర్పాటు ఏర్పాటు అవసరం లేదని స్పష్టం చేశారు. దీనివల్ల గోడౌన్‌కు ప్రభుత్వం అద్దె చెల్లించాలని, అదనపు సిబ్బందిని నియమించాలని నెలకు రూ.లక్షల్లో ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందన్నారు. ప్రభుత్వ గోడౌన్ ఉండగా, అధిక మొత్తంలో అద్దెని చెల్లించి ప్రైవేటు గోడౌన్ టెక్కలిలో ఎందుకు పెడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఐఎంఎల్ డిపో కోసం కార్మిక కుటుంబాలు కోట్లాది రూపాయల విలువ చేసే భూమిని ఉచితంగా త్యాగం చేసి ఇచ్చారని, ఇప్పుడు డిపో తరలిపోవడం వల్ల కార్మిక కుటుంబాలు పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, హమాలీల ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. హమాలీలు ఒంటరిగా లేరని జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు వారి వెన్నంటి ఉన్నారని చెప్పారు. దళితులు, పేదలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే డిపోను యథావిధిగా కొనసాగించాలని, ఎచ్చెర్లలోనే అవసరానికి తగ్గట్టు గోదాములు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిబిసిఎల్ హమాలీస్ యూనియన్ నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, నిడిగంట్ల రమణ, జి.శ్రీనివాసరావు, లండ సీతారాం, లింగాల రాము, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విద్యుత్‌శాఖ ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లావ్యాప్తంగా ఆర్.డి.ఎస్.ఎస్ పథకంలో భాగంగా ఫీడర్ శాగ్రిగేషన్, బైఫర్కేషన్ సంబంధిత విద్యుత్ పనుల నిర్వహణకు సంబంధించి ఈనెల ఒకటో తేదీన ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు కింది మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచే అవకాశం ఉందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రణస్థలం మండలం కోష్ట, పిషిణి ఫీడర్ పరిధిలోని వెంకటరావుపేట, వల్లభరావుపేట, దేరశాం.

లావేరు మండలం ఆదపాక ఫీడర్ పరిధిలోని గుర్రాలపాలెం, వైదయ్యవలస, పెద్దకొత్తపల్లి.

ఎచ్చెర్ల మండలం కొయ్యాం, జరజాం, ఎస్.ఎం పురం, బడివానిపేట, ఫరీదుపేట, కె.కె నాయుడుపేట.

పాతపట్నం మండలం పాతపట్నం టౌన్, ఆర్.ఎల్ పురం, కొరసవాడ, చెంగుడి, సరాళి, సీతారాంపల్లి, బోరుభద్ర, తిద్దిమి.

మెళియాపుట్టి మండలం చిన్నహంస, తిదిమి, మెళియాపుట్టి కేంద్రం పరిధి ప్రాంతాలు.

కోటబొమ్మాళి మండలం అక్కుపల్లి, సరియాపల్లి, దొంత.

పోలాకి మండలం ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్, డోల, పోలాకి, జర్జాం ఫీడర్ల పరిధిలోని ఎస్.ఎమ్.పురం, గొల్లలవలస, తోటాడ, సుసరాం, నడగాం, సుందరాపురం, చోడవరం, వెంకటాపురం.

కవిటి మండలం డి.జి పుట్టుగ, కుసుంపురం, మాణిక్యపురం, దూగానపుట్టుగ

సరుబుజ్జిలి మండలం రొట్టవలస.

ఆమదాలవలస మండలం జి.కె.వలస, కొత్తవలస, నిమ్మతొర్లాడ, కొరపాం, సీపన్నపేట.

ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ బ్యాచ్ ప్రారంభం

శ్రీకాకుళం : ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 22వ బ్యాచ్‌ను జిల్లా ఇన్‌ఛార్జి ప్రజా రవాణాధికారి పి.బి.ఎం.కె రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ స్కూల్ 23వ బ్యాచ్‌ను సెప్టెంబరులో ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ బ్యాచ్‌కి 16 మందికే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. లైట్ మోటారు వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 ఏళ్లు నిండిన వారు ఈ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు అర్హులని తెలిపారు. మొత్తం శిక్షణ 40 రోజుల పాటు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7382921733 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటి, రెండో డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ, పర్సనల్ ఆఫీసర్ కృష్ణవేణి, అకౌంట్స్ అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి కార్యాచరణ ప్రణాళిక


మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరావు

శ్రీకాకుళం సిటీ: అక్టోబరు రెండో తేదీ నాటికి శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంపూర్ణ నిషేధం కోసం 50 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణ యజమానులు కచ్చితంగా చెత్త బుట్టను ఏర్పాటు చేసుకోవాలని, గుడ్డ సంచులు గానీ బయో ప్లాస్టిక్ మాత్రమే వాడాలని స్పష్టం చేశారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. టీ షాపుల్లో గాజు, పింగానీ, స్టీల్ గ్లాసులు వాడాలన్నారు. వినాయక మండపాల్లో ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధమన్నారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులు వినియోగించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల సిబ్బంది, పాఠశాలలు, కళాశాలలు, సంఘాలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్, హోటల్స్, దుకాణాలు, వీధి విక్రయదారులు తదితరులందరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

విపత్తుల నిర్వహణలో సమన్వయం అవసరం

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సునామీ, తుపాన్లు ఇతర విపత్తుల సమయంలో పలు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తీర ప్రాంత గ్రామాల్లో సునామీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, మత్స్యకారుల కుటుంబాలు, వారి వలలు, పడవలు, ఇతర ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా సంబంధిత శాఖలు పాటించాల్సిన ప్రామాణిక కార్యాచరణ విధానాల గురించి ఆరా తీశారు. ప్రతి శాఖ తమకంటూ ఒక కార్యాచరణ విధానాన్ని రూపొందించుకోవాలని, దాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన వనరులను సమకూర్చుకోవాలని సూచించారు. కీలకమైన విపత్తుల సమయంలో పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ, పశుసంవర్ధక, రాష్ట్ర విపత్తుల నిర్వహణ వంటి ముఖ్యమైన శాఖల మధ్య సమన్వయం అవసరమని పునరుద్ఘాటించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (విపత్తుల నిర్వహణ) రాము మాట్లాడుతూ, తుపాన్ల సమయంలో తుపాను షెల్టర్లను ఉపయోగిస్తామన్నారు. సునామీ వంటి పరిస్థితుల్లో అవి కూడా సురక్షితం కానందున బాధితులను తరలించడానికి ప్రత్యేకమైన, సురక్షితమైన పునరావాస కేంద్రాలను గుర్తించాలన్నారు. రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం నుంచి జిల్లా యంత్రాంగానికి సమాచారం అందిన వెంటనే, దాన్ని తక్షణమే అన్ని శాఖలకు తెలియజేయనున్నట్లు తెలిపారు. ఆర్‌టిఒ గంగాధర్ మాట్లాడుతూ, ప్రజలను తరలించడానికి సరైన ప్రణాళికను రూపొందించామనిన్నారు. తక్షణ చర్యలకు ఎటువంటి జాప్యం జరగదని చెప్పారు. తరలింపునకు ప్రజలు సరిగా సహకరించడం లేదని, కుల పెద్దల సహకారం తీసుకుని వారికి ముందుగా సునామీపై అవగాహన కల్పించాలని పోలీస్ శాఖ అధికారులు కోరారు. పాఠశాల పిల్లలకూ వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా సహాయ ఫైర్ అధికారి శ్రీనుబాబు మాట్లాడుతూ సునామీకి ముందు, సునామీ సమయంలో, సునామీ తదుపరి నిర్వహించాల్సిన కార్యక్రమాలను శాఖాపరమైన ప్రామాణిక పద్ధతుల ద్వారా అన్ని శాఖల సమన్వయం, సహకారంతో స్పందించేందుకు ఏర్పాట్లు, పరికరాలు సమకూర్చుకున్నామని తెలిపారు. ఈ సమయంలో కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినే అవకాశం ఉన్నందున పోలీస్ విభాగం వైర్‌లెస్ సెట్‌ల ద్వారా కమ్యూనికేషన్ అందిస్తూ సూచనలు జారీ చేస్తామని డిఎస్‌పి శేషగిరి అన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ డీడీ సత్యనారాయణ, పోలీస్‌శాఖ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

మహారాజశ్రీ శ్రీకాకుళం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
EP: 11/2024
in FDA: 83/2023 in OS: 2/2017

Between:-
Murapala Ramesh Babu. ....DHR/వాది
And:-
Vommaravilli Roop Kumar & Another. .....JDRs/ప్రతివాదులు

To,
1. వమరవిల్లి రూప్ కుమార్, S/o లేటు నాగేశ్వరరావు, వయస్సు: 44 సం॥లు,R/at House. No: 152, హడ్కో కోలని, బలగ, శ్రీకాకుళం టౌన్ మరియు జిల్లా.
2. వమరవిల్లి జనార్ధన, S/o లేటు నాగేశ్వరరావు, వయస్సు: 34 సం॥లు, House. No: 152, హడ్కో కోలని, బలగ, శ్రీకాకుళం టౌను మరియు జిల్లా.

నోటీసు

పై నెంబర్‌లో DHR తనఖా పత్రం ఆస్తి డిక్రీ ప్రకారం సొమ్ము వసూలు చేయుటకు గాను సదరు తనఖా పత్రం ఆస్తులను అనగా డిక్రీ షెడ్యూల్ దాఖలు ఆస్తులను వేలం వేయించమని కోరుచు పై నెంబర్ అమలు పిటిషన్ దాఖలు చేసినందున **మీకు నోటీసు నిమిత్తం 18-08-2025 తేదీకి వాయిదా అయివున్నది.** గాన ఇందు విషయమై మీకు గల అక్షేపణలు ఉన్న యెడల పై తేదిన **పై కోర్టులో ఉ॥10:30 గం॥ లకు** స్వయంగా కాని, న్యాయవాది గారి ద్వారా కాని హాజరై తెలియపరుచుకొనవలెను లేని యెడల మీ పరోక్షమునకు Ex-Parte తీర్మాణం జరిపించడమగునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

// పై కోర్టు ఉత్తర్వుల ప్రకారం //
డి. సరళ కుమారి, న్యాయవాది,
శ్రీకాకుళం, ఫోన్: 8247600229.



రికార్డులను పరిశీలిస్తున్న విప్ అశోక్

వసతిగృహాలపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి – కవిటి

వసతి గృహాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, దీనిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత సిబ్బంది పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులో ఉంటూ నడిపించాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సూచించారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో వసతిగృహాల సలహా కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాలలు ప్రారంభం కావడంతో వసతిగృహాల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశం కల్పించి వారిని పర్యవేక్షించాలని సూచించారు. అదే సమయంలో వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తూ వారికి మార్గదర్శనం చేయాల్సిన బాధ్యత వార్డెన్లదేనన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు పూర్తి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. రాత్రి వేళలో వార్డెన్లు వసతిగృహాల్లోనే ఉంటూ విద్యార్థులకు శిక్షణ అందించాలని సూచించారు. అనంతరం సందర్భంగా వసతి గృహాల రికార్డులు పరిశీలించి వార్డెన్లలకు సూచనలు అందించారు. సమావేశంలో నాలుగు మండలాల వసతిగృహాల వార్డెన్లు, సంబంధిత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ప్రజాశక్తి – టెక్కలి

ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు డిమాండ్ చేశారు. స్థానిక మెయిన్ బజారులో ఉన్న పాఠశాలలో గురువారం యుటిఎఫ్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బదిలీ ఉపాధ్యాయులు తమ స్థానాలు కోరుకుని మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ వారిని రిలీవ్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. అదేవిధంగా వారికి జీతాలు కూడా మంజూరు కాకపోవడం చట్టవిరుద్ధమని అన్నారు. పెరిగిన ఆర్థిక అవసరాల దృష్ట్యా 30 శాతం ఆర్ఐ ప్రకటించాలన్నారు. బకాయి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుందన్నారు. జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేయడం సరికాదన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు పాలవలస ధర్మారావు, జెవివి జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షులు పడాల గణపతిరావు, తమ్మినేని వెకుంఠరావు, జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు, మారం కుమారస్వామి, డొంకాన పాపారావు, రోణంకి విజయ్‌కుమార్, బాపూజీ పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన పోలీసులతో ఎస్‌పి మహేశ్వర రెడ్డి

శేష జీవితాన్ని సంతోషంగా గడపాలి

ప్రజాశక్తి – శ్రీకాకుళం సిటీ

సుదీర్ఘకాలం జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ చేసిన పోలీసులు ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో, సంతోషంగా శేష జీవితాన్ని గడపాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సుమారు 35 ఏళ్ల పోలీసు ఉద్యోగులుగా ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందించిన వారికి సమాజంలో ఎప్పుడూ గౌరవం లభిస్తుందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం లభించిన ప్రతి ప్రయోజనాన్ని ప్రణాళిక బద్ధంగా ఖర్చుచేసి, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు కె.వి రమణ, పి.శ్రీనివాసరావు, పరిపాలనా అధికారి సిహెచ్ గోపీనాథ్, ఆర్ఐ కె.నర్సింగరావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్. కృష్ణం నాయుడు, ట్రెజరర్ భుజంగరావు, జగదాంబ, పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

అల్లాడ సొసైటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి – జలుమూరు

మండలంలోని అల్లాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ చైర్మన్‌గా వెలమల చంద్రభూషణ్, డైరెక్టర్లుగా సనపల రాంజీ, కొబగాపు వెంకటరావులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎల్లా వేళలా అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. రైతు సమస్యలపై దృష్టిసారించాలన్నారు. సిఎం చంద్రబాబు ఆకాంక్షల మేరకు రైతుల శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ శివ్వాల సూర్యం, టిడిపి మండల అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, జెడ్‌పిటిసి మెండ రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, చల్లవానిపేట, నరసన్నపేట పిఎసిఎస్ చైర్మన్లు దుంగ స్వామిబాబు, ఇసా అప్పారావు, సారవకోట మండల టిడిపి అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ పాల్గొన్నారు.

స్పౌజ్ పింఛన్ల మంజూరు

లావేరు : మండలానికి 202 స్పౌజ్ పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎంపిడిఒ పి. వెంకటరాజు గురువారం తెలిపారు. గతంలో భర్త పింఛను పొందుతూ మృతి చెందిన వారి భార్యలకు ఈ పింఛన్లను మంజూరు చేసినట్లు తెలిపారు. నూతనంగా మంజూరైన పింఛన్లను ఆగస్టు 1న శుక్రవారం లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని చెప్పారు. లావేరు పంచాయతీకి 18 ఫౌజ్ పింఛన్లు మంజూరయ్యాయి. ఈ పింఛన్లను సచివాలయ సిబ్బంది లబ్దిదారుల ఇంటికి వెళ్లి అందజేస్తారన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

పలాస : సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని పలాస వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం.రామారావు అధికారులకు సూచించారు. పలాస వ్యవసాయ శాఖ ఎడిఎ కార్యాలయంలో పలాస డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులతో సమచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, వివరాలు కోసం ఎవరైనా సమచార హక్కు చట్టం కింద దరఖాస్తులు చేసుకుంటే తక్షణమే స్పందించి వివరాలను అందించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వాటి నుంచి వచ్చే ఇబ్బందులకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎవరు అడిగినా వివరాలు ఇచ్చేలా ఉండాలని, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను తమ వద్ద ఉంచుకోవాలని అన్నారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులపై అలసత్వం వహించ వద్దని హితవుపలికారు. కార్యక్రమంలో పలాస, వజ్రపుకొత్తూరు వ్యవసాయ శాఖ ఎఓలు పోలారావు, ధనుంజయ, వెలుగు ఎపిఎం జాంబవతి, సూర్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పలాస : అవగాహన కల్పిస్తున్న ఎడిఎ రామారావు

కవిటి: మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై ఎఒ శ్రీదేవి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సమాచార హక్కు చట్టం ఒక శక్తివంతమైన సాధనంగా వ్యవహరిస్తుందని అన్నారు. రైతులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రైతులు తాము పొందాల్సిన సబ్సిడీలు, పంటల నష్టపరిహారాలు, సాగునీటి పథకాల అమలు వివరాలు వంటి అంశాలపై సమాచారాన్ని అధికారాల వద్ద నుంచి స్వయంగా పొందవచ్చని ఆమె తెలియజేశారు. ఈ చట్టం ద్వారా వ్యవసాయ సంబంధిత విధానాల విషయంలో పారదర్శకత పెరగడమే కాక, రైతుల విశ్వాసాన్ని ఈ చట్టం పెంచుతుందని అన్నారు.

నందిగాం: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు సమాచార హక్కు చట్టంపై ఎఒ శ్రీకాంత్‌వర్మ గురువారం అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం, ఆవశ్యకత, అమలు వంటి విషయాలు వివరించారు. ఈ చట్టం కింద ఎలాంటి అర్జీ వచ్చినా దాన్ని అత్యంత ప్రాధాన్యతాక్రమంలో సమాచారం అందించడానికి కృషి చేయాలన్నారు. అలాగే పంటల బీమా పథకంలో ఎక్కువ మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంట నమోదు ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రగడ వాసవి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : తహశీల్దార్ కార్యాలయంలో ఎఒ దానకర్ణుడు మండల వ్యవసాయ శాఖ సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారులకు, వ్యవసాయ సహాయకులకు అన్నదాత సుఖీభవ కింద వచ్చిన 113 ఎన్‌పిసిఐ లింకులేని రైతులకు త్వరిత గతిన బ్యాంక్ ఎకౌంట్‌కు లింకు చేయించాల్సిందిగా రైతులకు సూచించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.పాపారావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి – వజ్రపుకొత్తూరు

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి, సంక్షేమమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని గరుడుభద్ర పంచాయతీ మర్రిపాడులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలండర్లు పథకాలపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, క్లిష్టర్ ఇన్‌ఛార్జి దువ్వాడ హేంబాబు చౌదరి, పిఎసిఎస్ డైరెక్టర్ రాపాక శాంతమూర్తి, తెలుగు యువత బి.శశిభూషన్, కోనారి గణపతి, ఎ.ఉమామహేశ్వరరావు, కో–ఆప్షన్ మాజీ సభ్యులు నెయ్యిల సూర్యనారాయణ, విఠల్, పోతనపల్లి సాంబమూర్తి, కొంచాడ మోహనరావు ఉన్నారు.

భాస్కరరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి – టెక్కలి

విశ్రాంత సీనియర్ ఆంగ్ల అధ్యాపకులు నంబూరు భాస్కరరావు మృతికి విశ్రాంత ఉద్యోగుల సంఘం నివాళ్లర్పించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. సీనియర్ ఆంగ్ల భాషోపధ్యాయునిగా టెక్కలిలో మొట్టమెదటి ప్రయివేట్ విద్యా సంస్థల అధినేతగా భాస్కరరావు అందించిన సేవలను కొనియాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు, కార్యదర్శి ధనుంజయరావు, గౌరవాధ్యఓఉలు జి.వి.రెడ్డి మస్టారు, విశ్రాంత ఉద్యోగులు సంఘ నిర్వాహకులు రెయ్యి పున్నయ్య, ప్రదాన హరిశ్చంద్రరావు పాల్గొన్నారు.

ప్రమాణాలతో కూడిన విద్య

ప్రజాశక్తి – శ్రీకాకుళం సిటీ

స్థానిక మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మొదలవలస కృష్ణవేణి ఒక ప్రకటనలతో తెలిపారు. ఈ ఏడాది మెరుగైన ప్రవేశాలు జరిగాయన్నారు. మధ్యాహ్న భోజనం అమలు, స్టడీ మెటీరియల్ అందజేయడం వంటివి పక్కాగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది మెరుగైన ఉత్తీర్ణత శాతం నమోదైందని, స్టడీ అవర్స్ సైతం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో లైబ్రేరియన్‌తో సహా అధ్యాపకుల పోస్టులు ఉన్నాయన్నారు. ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన విద్యా ప్రమాణాలు అందజేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

జిల్లా క్రీడాభారతి కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి – శ్రీకాకుళం సిటీ

అరసవల్లిలోని చైతన్య విద్యా విహార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం క్రీడాభారతి కార్యవర్గం ఏర్పాటు చేసి మొదటి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్వహణ కర్తగా ఒలింపియన్ ఎం.వి మాణిక్యాలు, ఆంధ్రరాష్ట్ర అధ్యక్షులు వంగా మహేష్ పాల్గొన్నారు. ఎన్నిక ప్రక్రియలో క్రీడాభారతి జిల్లా అధ్యక్షులుగా ఆదిత్య కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ చెటికం రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా (ప్రెసిడెంట్) గా బి.అనంత లక్ష్మదేవ్, దండాసి జ్యోతిభాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒలింపియన్ మాణిక్యాలు మాట్లాడుతూ విద్యార్థులు తాను ఆసక్తి ఉన్న ఒక క్రీడను ఎంచుకోవాలని, ఆ క్రీడలో క్రమం తప్పకుండా అభ్యాసన చేయాలని, క్రీడాకారులుగా దేశానికి మంచి గుర్తింపు తేవాలన్నారు. సెల్‌ఫోన్లు విడిచిపెట్టి క్రీడలపై ఆసక్తి కనబరిస్తే శారీరకంగా, మానసికంగా ప్రతి విద్యార్థి బలపడతారన్నారు.

వంశధార కాలువ పనులు ప్రారంభం

ప్రజాశక్తి – నరసన్నపేట

మండలంలోని పురుషోత్తం నగర్ కాలనీ, శివనగర్ కాలనీ, వీరనాయుడు కాలనీ, జగన్నాథపురానికి ఆనుకుని వంశధార కాలువ ఆధునికీకరణ పనులను మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కింజరాపు రామారావు, పిఎసిఎస్ సభ్యులు సరిపిల్లి మధు, వార్డు గొలివి రామారావు, తెలుగు యువత సభ్యులు రావాడ గణపతిరావు, మొయ్యి హరికృష్ణ, పొన్నాన ఆనంద్, దుప్పల పూడి లక్ష్మణ్, విజయ్, సూరపు సురేష్, కేలం చిరంజీవి, ముద్దాడ రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

మహిళలు వ్యాపారులుగా ఎదగాలి

ప్రజాశక్తి – రణస్థలం

మహిళలు వ్యాపారులుగా ఎదగాలని, ఆర్థికంగా కుటుంబాలకు ఆసరగా నిలవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ ఆవరణలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల హక్కులను ప్రోత్సహించడానికి, లింగ ఆధారిత హింసను పరిష్కరించడానికి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభించుకోవడం చాలా ఉపయోగకరమైనదన్నారు. హింసకు గురైన లేదా వారి హక్కులను కోల్పోయిన మహిళలకు సురక్షితమైన, మద్దతు ఇచ్చే ప్రదేశంగా జెండర్ రిసోర్స్ సెంటర్ స్థాపించడం, న్యాయం, సహాయం, వనరులను అందించడం ద్వారా మహిళలను సాధికారపరచడానికి ఇది అంకితం చేయబడిందన్నారు. అవసరమైన మహిళలకు చట్టపరమైన, మానసిక, సామాజిక మద్దతును అందించడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా మహిళలు చదువుకుని మంచి ఉద్యోగాలు చేయాలని, అలాగే మంచి వ్యాపారులుగా ఎదగాలన్నారు. డిఆర్‌డిఎ పీడీ పెద్దింటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను, ముఖ్యంగా గృహ హింస, దోపిడీ, లింగ వివక్ష వంటి సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌డి డిపిఎం గౌరీ, ఎస్ఐ ఎస్.చిరంజీవి, ఎంపిడిఒ ఎన్.ఈశ్వరరావు, వెలుగు ఎపిఎం మాధవిలత, నాయకులు డిజిఎం ఆనందరావు, పిన్నింటి భానోజీనాయుడు, జిల్లా సమాఖ్య అధ్యక్షులు, మండల సమాఖ్య అధ్యక్షులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'బిగ్ హెల్ప్' సహాయం

ప్రజాశక్తి – సంతబొమ్మాళి

మండలంలోని నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు 'బిగ్ హెల్ప్' స్వచ్ఛంద సంస్థ గురువారం బహుమతులను, ప్రోత్సాహకాలను అందించింది. సంస్థ నౌపడ ప్రాజెక్టు చైర్మన్ సి.వి.రాజా, డైరెక్టర్ ఎల్.జయకృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జి హెచ్ఎం మాధవరావులు అందించారు.. 2024–25 విద్యా సంవత్సరంలో తరగతుల వారీగా ప్రతిభ చూపిన ప్రథమ, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు రూ.5,500 ప్రోత్సాహకాలను అందించారు. ఈ ఏడాది 15 మంది అనాథ, నిరుపేద, వికలాంగ, క్రీడా ప్రతిభ చూపిన విద్యార్థులను గుర్తించి స్టేషనరీ వస్తువులను అందజేశారు. ఇకపై ప్రతిభి చూపిన టాప్ 10 విద్యార్థులకు గోల్డ్‌స్టార్ అవార్డులు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్కలి : బిగ్‌హెల్ప్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని తలగాం, ఎట్ నౌపడా ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు పేడాడ అమ్మనమ్మ అవార్డులను అందజేశారు. అసోసియేషన్ డైరెక్టర్ బొడ్డేపల్లి విద్యావతి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తమ సంస్థ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పారావు, లత, నరసింహమూర్తి, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, వీరాస్వామి, తిరుపతిరావు పాల్గొన్నారు.



సంతబొమ్మాళి : ప్రోత్సకాలను అందిస్తున్న సంస్థ ప్రతినిధులు



విలేకరులతో మాట్లాడుతున్న సూర్యనారాయణ

టిడిపి హయాంలోనే రైతులకు మేలు

ప్రజాశక్తి – ఆమదాలవలస

టిడిపి హయాంలోనే రైతులకు మేలు జరిగిందని డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై రాజకీయ ఓనమాలు నేర్చుకుని మాట్లాడాలని, కనీస అవగాహన లేకుండా మాట్లాడడం తగదన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ కుమార్తె లండన్‌లో డిగ్రీ పట్టా పొందిన సందర్భంగా కాన్వకేషన్‌లో పాల్గొంటే లేనిపోని ఆరోపణలు చేయడం ఆయన విజ్ఞతకే విడిచి పెడుతున్నామన్నారు. అలాగే ఆగస్టు 4 నుంచి ఆరో తేదీ వరకు అమెరికాలోని బోస్టన్‌లో ప్రపంచ స్థాయి శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యే రవికుమార్ పాల్గొనడానికి వెళ్తే అవగాహనాలేమితో చింతాడ మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. ఎరువుల కొరత అంటూ లేనిపోని అబద్ధాలు, అసత్యాలు మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎరువులు కొరత లేకుండా చూడాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి, టిడిపి నాయకులు సంపదరావు మురళీ, తాడేల రాజారావు పాల్గొన్నారు.

బీమాపై అవగాహన లేక అవస్థలు

బూర్జ: ప్రజలకు, బ్యాంకు ఖాతాదారులకు గ్రామీణ బ్యాంక్ సేవలపై స్పష్టమైన అవగాహన లేకపోవడంతో బీమా, ఇతర సదుపాయాలను పొందలేక పోతున్నారని ఎపి గ్రామీణ బ్యాంక్ పార్వతీపురం రీజనల్ మేనేజర్ కె.అర్జునరావు స్పష్టం చేశారు. గురువారం బూర్జ గ్రామీణ బ్యాంకులో ఆర్ఎం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా ఎపిజిబి బూర్జ శాఖ పరిధిలో ఉన్న అన్నంపేట గ్రామానికి చెందిన బాలి వెంకటరమణ గతంలో బూర్జ ఎపి గ్రామీణ బ్యాంకులో రూ.500 ఎస్‌బిఐ జనరల్ బీమా చెల్లించారు. వెంకటరావు దురదృష్టవశాత్తు ప్రమాదంలో మరణించడంతో ఆయన భార్య బాలి చిన్నమ్మడుకు గురువారం బూర్జ బ్రాంచ్‌లో రూ.పది లక్షల చెక్కును రీజనల్ మేనేజర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటిని సద్వినియోగం చేసుకొని పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతులగా తీర్చిదిద్దాలని, కుటుంబం ఆర్థికంగా ఎదుగుతూ వెంకటరావు ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆయన కోరారు. అనంతరం ఎఫ్ఐసి నోడల్ ఆఫీసర్ ఎం.మన్మధరావు, బూర్జ బ్రాంచ్ మేనేజర్ నార్ని కిషోర్ మాట్లాడుతూ టివి, ఫ్రిడ్జ్, సెల్‌ఫోన్ వంటి వస్తువులకు, వాహనాలకు ఇన్సూరెన్స్ చేయిస్తున్న ఈ రోజుల్లో మనకోసం, మన పిల్లల కోసం, తల్లిదండ్రుల కోసం, మన ఆరోగ్యం కోసం ఎటువంటి ఇన్సూరెన్స్ చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చైతన్య వంతులై, కుటుంబాలు వీధిన పడకుండా చిన్నాభిన్నం కాకుండా ముందు జాగ్రత్త కోసం ప్రతిఒక్కరు బీమా చెల్లించాలన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ సతీష్, ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్ మేనేజర్ సురేష్, బ్రాంచ్ సిబ్బంది, సిఎస్‌పిలు, సిఎఫ్‌లు, బ్యాంక్ ఖాతాదారులు, అన్నంపేట గ్రామపెద్దలు, పాల్గొన్నారు. ముందుగా రూ.436 బీమా చెల్లించి సాధారణ మరణం పొందిన మరో పదిమంది కుటుంబాలకు రూ.2 లక్షల చెక్కులను ఆయన అందించారు.

మాజీ జెడ్‌పిటిసి లక్ష్మణరావు మృతి



లక్ష్మణరావు పాడె మోస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు, (ఇన్‌సెట్‌లో) లక్ష్మణరావు (ఫైల్)

ప్రజాశక్తి – రణస్థలం

రణస్థలం మండలం పాతర్లపల్లి గ్రామానికి చెందిన రణస్థలం మాజీ జెడ్‌పిటిసి, సీనియర్ నాయకులు గొర్లె లక్ష్మణరావు మృతి చెందారు. ఇటీవల ఎచ్చెర్ల మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి రిమ్స్ ఆస్పత్రిలో గత కొద్దిరోజులుగా చికిత్స పొందుతున్న ఆయన గురువారం తుదిశ్వాస విడిచారు. 1962లో పాతర్లపల్లిలో జన్మించిన ఈయన విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తిగా, ఎన్నో విద్యార్థి, ప్రజా సమస్యలపై పోరాడిన నేతగా జిల్లా ప్రజలకు సుపరిచితులు. ఈయనకు భార్య ప్రసన్న లక్ష్మి, ఎంబిబిఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కుమార్తె దేవినేహదత్త నాయుడు ఉన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్సీ గొర్లె హరిబాబు నాయుడు, ప్రముఖ న్యాయవాది గొర్లె రామారావుకు ఈయన సోదరుడు. 1983లో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలకు కార్యదర్శిగా, 1984లో కళాశాల విద్యార్థి సంఘ చైర్మన్‌గా ఎన్నికై విద్యార్థుల సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించారు. 1989లో విశాఖపట్నం ఎన్‌విపి లా కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షుడుగా ఎన్నికై రూరల్ విద్యార్థులకు హాస్టల్ సదుపాయాలు, మెరుగైన బోధన, ఉపకార వేతనాల కోసం ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో ఎన్నో ఉద్యమాలు చేశారు. ఎన్.ఎస్.యు.ఐ జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సుదీర్ఘకాలం సేవలు అందించిన ఈయన ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో శ్రీకాకుళం జిల్లాకు రూరల్ యూనివర్సిటీ ఏర్పాటు హామీఇచ్చినా అది నల్గొండకు తరలిపోవడంతో ఎచ్చెర్లలో యూనివర్సిటీగా ఏర్పాటు చేయాలని కోరుతూ లక్ష్మణరావు చేసిన పోరాటంలో కొద్ది రోజులు జైలు జీవితాన్ని కూడా అనుభవించాల్సి వచ్చింది. లక్ష్మణరావు కృషి ఫలించి తొలుత ఎచ్చెర్లలో పీజీ సెంటర్ ఏర్పడగా తర్వాత అది యూనివర్సిటీగా రూపుదిద్దుకుంది. జిల్లాలో ప్రముఖ రాజకీయ నేతగా, 14 ఏళ్లు డిసిసి అధ్యక్షుడిగా గొర్రె హరిబాబు నాయుడు పనిచేసిన సమయంలో అన్నకు చేదోడు వాదోడుగా ఉంటూ కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించడంలో లక్ష్మణరావు ప్రముఖమైన పాత్ర పోషించారు. ఈయన 2001 నుంచి 2006 వరకు రణస్థలం జెడ్‌పిటిసిగా పనిచేశారు. లక్ష్మణరావు మృతికి తెలుగు రాష్ట్రాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పౌర సంఘాల నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు. కుమార్తె దేవినేహదత్త నాయుడు తండ్రి మృతదేహానికి దహనసంస్కారాలు చేపట్టారు.

పలువురు పరామర్శ

ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, అలాగే అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు అధిక సంఖ్యలో వచ్చి పరామర్శించారు. లక్ష్మణరావు పాడిని ఎమ్మెల్యే ఈశ్వరరావు మోసి ఆయనతో ఉన్న స్నేహాన్ని చాటుకున్నారు.



ఆటో ఢీకొని వృద్ధుడు మృతి

పొందూరు: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని జోగెన్నపేట వద్ద బుధవారం రాత్రి ఆటో ఢీకొని గ్రామానికి చెందిన టొంపల సింహాచలం (80) అనే వృద్ధుడు మృతిచెందినట్టు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. పొందూరు నుంచి దేవరవలస వెళ్తున్న ఆటో డ్రైవర్ గ్రామం వద్ద నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయాలు కాగా సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతదేశాన్ని శ్రీకాకుళం సర్వజనాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి ఒక కుమార్తె ఉంది. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యాచకుడు మృతి

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని ఐదవ వార్డు రెడ్డివానిపేట గ్రామం వద్ద యాచకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గత నాలుగు రోజులుగా చుట్టుపక్కల గ్రామాల్లో 50 ఏళ్లవయసు గల పురుషుడు భిక్షాటన చేస్తూ తిరుగుతూ ఉండేవాడని, గురువారం రెడ్డిపేట గ్రామం వద్ద మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకొని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన లక్ష్మణరావు

వ్యక్తికి తీవ్ర గాయాలు

పొందూరు: మండలంలోని కృష్ణాపురం వద్ద ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో గురువారం లోలుగు గ్రామానికి చెందిన ఎం.లక్ష్మణరావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు లక్ష్మణరావు కృష్ణాపురం సమీపంలో గల స్తంభాల ప్యాక్టరీలో పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం పని నిమిత్తం ఫ్యాక్టరీకి వెళ్తుండగా ఎదరుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో లక్ష్మణరావుకు కుడికాలు విరిగిపోవడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనం ద్వారా చికిత్స కొరకు శ్రీకాకుళంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.



ఎరువులను పంపిణీ చేస్తున్న నాయకులు

ఎరువుల పంపిణీ

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎఒ పిరియా శ్రీదేవి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూపన్ పద్ధతిలో రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎరువులు అవసరమైన రైతులు స్థానిక రైతు సేవ కేంద్రం వద్ద ఎరువులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పి. నారాయణస్వామి, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బెందాళం తిరుమల కుమార్, విఎఎ వనజ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు గురువారం హెచ్ఎం వాగ్దేవి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులకు దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ మెట్ట గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్రబాబు సందర్శన

లావేరు: ఎచ్చెర్ల నియోజక వర్గం జనసేన ఇన్‌ఛార్జి విశ్వక్సేన్ ఇంటిని జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదల నాగేంద్ర బాబు గురువారం ఎచ్చెర్ల మండలం తోటపాలెం గ్రామంలో సందర్శించారు. ఈ సందర్భంగా నియోజక వర్గ సమస్యలపైన, పార్టీ బలోపేతం కోసం చర్చించారు. అనంతరం విశ్వక్సేన్ కుటుంబసభ్యులతో గ్రూప్ ఫోటో దిగి కష్టాలు చర్చించు కున్నారు. నాగబాబు విశ్వక్సేన్ పిల్లలతో ముచ్చటించారు. చిన్నారులకు కుశల ప్రశ్నలు వేసి సరదాగా గడిపారు.



విశ్వక్సేన్ కుటుంబ సభ్యులతో నాగబాబు



పరిశీలిస్తున్న దాసరి రాజు

జనసేన కార్యకర్త ఇంటిపై దాడి

ఇచ్ఛాపురం: ఇచ్చాపురం పిఎసిఎస్ డైరెక్టర్, జనసేన వీర మహిళ బాసి భారతిరెడ్డి ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి చేశారు. విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు భారతీరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈదుపురానికి చెందిన ఆమె ఇంట్లో లేని సమయంలో, కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు నివాసంలోకి ప్రవేశించి సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ విషయం ప్రభుత్వ విప్, పోలీసుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పరిసరాలను పరిశీలించి ఆమెకు ధైర్యం చెప్పారు.

తండ్రి చితికి కుమార్తె తలకొరివి

సరుబుజ్జిలి: మండలంలోని పాతపాడుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు టంకాల చిన్నప్పల నాయుడు (65) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు కాగా ఒక కుమార్తె అమెరికాలో, మరో కుమార్తె బెంగళూరులో, ఒకరు విశాఖపట్నంలో తమ కుటుంబాలతో ఉంటున్నారు. ఇద్దరు కుమార్తెలు అందుబాటులో లేకపోవడంతో మగ సంతానం లేని చిన్నప్పల నాయుడు మృతదేహానికి పెద్దకుమార్తె విజయలక్ష్మి తండ్రి చితికి నిప్పుపెట్టి దహన సంస్కారాలు నిర్వహించారు. ఉపాధ్యాయుడిగా ఈ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొంది గ్రామంలోని ఎన్నో సంఘ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మృతుని చివరి దశలో ఇద్దరు కుమార్తెలు అందుబాటులో లేకపోవడం, పెద్దకుమార్తె దహన సంస్కారాలు నిర్వహించడంపై గ్రామస్తులతో పాటు పరిసర గ్రామ ప్రజలు విచారం వ్యక్తం చేశారు.



దహన సంస్కారాలు చేస్తున్న కుమార్తె విజయలక్ష్మి

ట్రిపుల్ ఐటికి విద్యార్థిని ఎంపిక


మాధురి

పొందూరు: మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన గోకర్ణపల్లికి చెందిన పేడాడ మాధురి ఒంగోలు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు హెచ్ఎం బల్ల కంటయ్య గురువారం తెలిపారు. ఈ ఏడాది పాఠశాలలో పదోతరగతి చదివిన మొత్తం ఐదుగురు విద్యార్థినులు ఇప్పటివరకూ ట్రిపుల్ ఐటి సీట్లు సాధించినట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థినికి ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న గణేష్

జీడి పంట సాగుపై అవగాహన

కొత్తూరు: స్థానిక వెలుగు కార్యాలయంలో కొత్తూరు, భామిని మండలాలకు చెందిన గిరిజన యువతకు జీడి పంట సాగుపై హార్టికల్చర్ అధికారి గణేష్ గురువారం అవగాహన కల్పించారు. జీడి పంట యాజమాన్యం, జీడి మొక్కలు పెంపకం, గేప్ ఫిల్లింగ్‌పై వివరించారుర. జీడి కొమ్మలు నరికినప్పుడు కింద గాటు పెట్టి తరువాత పైన నరకడం మంచిదన్నారు. గాటు పెట్టిన దగ్గర పేడగత్తం వేయాలన్నారు. నాటు విధానం, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ ఇసి సంజీవరావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

లైంగిక వేధింపుల నివారణపై ర్యాలీ

పలాస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై గురువారం డిగ్రీ కళాశాల నుంచి ఇందిరా గాంధీ కూడలి వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు వినియోగించడం ద్వారా ఎక్కువగా మహిళలపై లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన


విద్యార్థులతో ఎంఇఒ శాంతారావు

నరసన్న పేట: విద్యార్థులకు క్రమశిక్షణ అలవాటు చేయాలని ఎంఇఒ యు.శాంతారావు సూచిం చారు. మండలంలో లఖిమేర ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. విద్యార్థులు సరైన సమాధానం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పథకం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.గణేష్, ఉపాధ్యాయులు బి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేత

శ్రీకాకుళం సిటీ: నగరంలో గురువారం షారోన్ ఆశ్రమం నందు హెచ్ఐవి పాజిటివ్ ఫ్యామిలీస్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్ హోల్డ్ చైర్మన్ టి.ఫిలిప్ తిమోతి హాజరయ్యారు. ఆయన ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన, గృహ సర్వే నిర్వహించారు. 20 కుటుంబాలకు ఒక్కొక్కటి రూ.780 విలువగల డ్రై రేషన్ న్యూట్రిషన్ కిట్స్ అందజేశారు. ఆరోగ్యంపై హెచ్ఐవి పాజిటీవ్ రోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అబద్ధపు హామీలతో బాబు మోసం


ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

అబద్ధపు హామీలతో ప్రజలను చంద్రబాబు మోసం చేశారని టెక్కలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త పేరాడ తిలక్ విమర్శించారు. వైసిపి మండల అధ్యక్షులు బి.మోహన్‌రెడ్డి ఆధ్వర్యాన నౌపడలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ ర్యాలీ గురువారం నిర్వహించారు. హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వసంత రెడ్డి, వైసిపి పిలక రవికుమార్‌రెడ్డి, పీరుపల్లి రాజశేఖర్, లోపింటి రాములు, బత్సల సుధాకర్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు, ఎంపిపి భర్త మేరుగు అప్పారావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ఎన్నికల్లో బాబు ఇచ్చిన హామీలపై నిలదీయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలన శ్రీనివాసరావు, వైసిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కంబాలరాయుడుపేట, పెద్దమురహరిపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు మద్దిల హరినారాయణ, వైసిపి మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు తిర్రి రాజారావు, దున్న బాలరాజు, గోరకల విశ్వనాథం, సర్పంచ్‌లు వంక చిరంజీవి, కొల్లి భాస్కరరావు, బచ్చల ధర్మారావు, ఉషారాణి పాల్గొన్నారు.

'సౌమిత్వ' లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి- పలాస


మాట్లాడుతున్న రమణ

గ్రామాల్లో సౌమిత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ కార్యదర్శులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో విడత సౌమిత్వలో భాగంగా 22 గ్రామాలను ఎంపిక చేశామని చెప్పారు. గ్రామాల్లో గ్రామ కంఠం భూములను గుర్తించి సర్వే చేసి త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలన్నారు. సౌమిత్వ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సౌమిత్వ సర్వే చేపడుతుందని, ఈ విషయాన్ని కార్యదర్శులు దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.


శిథిలావస్థకు చేరుకున్న షాపింగ్ కాంప్లెక్స్

శిథిలావస్థలో షాపింగ్ కాంప్లెక్స్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టి మండల కేంద్రంలోని రాధాగోవిందస్వామి ఆలయం ఎదురుగా ఏర్పాటై షాపింగ్ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరుకుంది. దాదాపు 15 ఏళ్ల కిందట రూ.ఆరు లక్షల వ్యయంతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ వినియోగం లేకుండానే శిథిలావస్థకు చేరుకుని ప్రజాధనం వృథాగా మారింది. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటయితే చిరు వ్యాపారులకు ఉపాధి కలగడంతో పాటు గ్రామ ప్రజలకు కాంప్లెక్స్ సేవలు అందుబాటు అవుతాయని గ్రామస్తులు అంటున్నారు. అధికారులు దృష్టి సారించి కాంప్లెక్స్ సేవలు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తిరుపతిరావుకు సన్మానం

ప్రజాశక్తి- మెళియాపుట్టి


తిరుపతిరావును సన్మానిస్తున్న సిబ్బంది

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విశిష్ట సేవలు అందించిన ఎస్.తిరుపతిరావు గురువారం తన ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, సిబ్బంది దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుపతిరావు నిబద్ధత, విధేయత, సహకార ధోరణి ఇతరులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజేశ్వరి, ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, తాడేల రామరాజు, కిరణ్, శాంతమ్మ, భాస్కరరావు, మురళి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- పలాస

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి పొందవచ్చని పలాస వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎం.రామారావు అన్నారు. వ్యవసాయ శాఖ ఎడిఎ కార్యాలయంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఖరీఫ్‌తో పాటు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు అన్నీ అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఈ మేరకు ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలో వీడియోలు చూసి మెలుకువలు తెలుసుకోవాలన్నారు. డ్వాక్రా సంఘాల మాదిరిగా రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి వారి ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో పలాస, వజ్రపుకొత్తూరు వ్యవసాయశాఖ ఎఒలు పోలారావు ధనుంజయ, వెలుగు ఎపిఎం జాంబవతి, ప్రకృతి వ్యవసాయం శిక్షకులు నాగరాజు, విజయకుమార్, శివాజీ, సూర్యనారాయణ, ఎస్.ధనుంజయరావు, పవన్ కుమార్ పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న ఎడిఎ రామారావు


నియామక పత్రాలను అందజేస్తున్న చైర్‌పర్సన్ విజయ

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్‌ల నుంచి సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం జెడ్‌పి బంగ్లాలో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ సహాయకులుగా పదోన్నతి పొందిన ఉద్యోగులు కష్టపడి పని చేసి జిల్లా పరిషత్‌కు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎల్ఎన్‌వి శ్రీధర్ రాజా, ముఖ్య కార్య నిర్వహణాధికారి డి.సత్యనారాయణ, ఉప ముఖ్య కార్య నిర్వహణాధికారి సి.సెక్షన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సి.సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూత్‌క్లబ్ ప్రతినిధి రమణమూర్తి

ఆసక్తి గల కోర్సులతో మంచి భవిష్యత్

ప్రజాశక్తి- లావేరు

స్కూల్ రెడీనెస్, బాల వికాస్ కార్యక్రమంలో భాగంగా యూత్‌క్లబ్ ఆఫ్ బెజ్జిపురం ఆధ్వర్యంలో బుడుమూరు ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి తరువాత చేయదగిన వివిధ కోర్సులను క్లబ్ ప్రతినిధి రమణమూర్తి వివరించారు. తమకు ఆసక్తి కలిగిన కోర్సులను ఎంపిక చేసుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని జీవశాస్త్ర ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేది కోర్సుల ఎంపికని ఆయన తెలిపారు. హెచ్ఎం రువ్వ పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో వైసిబి ప్రతినిధి రాధ పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న చిన్నమ్మి

బంగారం షాపుల తనిఖీ

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట పట్టణంలో బంగారం షాపులను లీగల్ మెట్రాలజీ అదికారి చిన్నమ్మి గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లో రికార్డులు, తూకవు యంత్రాలు, ఖాతాదారులకు ఇస్తున్న బిల్లులు తదితర అంశాలపై నిశితంగా పరిశీలించారు. దుకాణదారులు ఖాతాదారులకు బిల్లులు ఇస్తున్నప్పుడు క్యారెట్లు తూకవు వేసి బిల్లుపై రాయడం లేదని కొన్ని షాపుల్లో గుర్తించారు. అలాగే ఇటీవల తనిఖీల్లో కొన్ని అవకతవకలు జరిగాయని, అటువంటి పరిస్థితి ఎదురైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. బిల్లులు సక్రమంగా లేని వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.